
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
మంగళవారం 7 అక్టోబరు 2025



'స్థానిక' సందడి



- ఎన్నికలపై పార్టీల వ్యూహాలు
- టికెట్ల కోసం ఆశావహుల ప్రయత్నాలు
- అభ్యర్థుల ఎంపికపై మొదలైన కసరత్తు
- జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీలు
- మరో రెండు రోజుల్లో నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

స్థానికసంస్థల ఎన్నికలషెడ్యూల్ రావడంతోనే గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో రెండువిడతల్లో ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది. మొదట పరిషత్ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆశావాహులు ఆయాపార్టీల పెద్దల చుట్టూ టిక్కెట్లకోసం తిరుగుతున్న సందర్భాలు ఒకవైపు కనిపిస్తుండగా మరోవైపు ఆయా పార్టీల అధిష్టానం సూచనల మేరకు పరిషత్ బరిలో గెలుపు గుర్రాలపై జిల్లా నాయకులు ఆరాతీస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 12 జడ్పీటీసీలు,123 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన క్రమంలో అందుకు అనుగుణంగా గెలుపు అభ్యర్థుల ఎంపిక కోసం సర్వేలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ జిల్లా నాయకులు అభ్యర్థులను రంగంలోదింపే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపు అభ్యర్థులపై ప్రధానంగా దృష్టి పెట్టారు. స్థానికంగా పలుకుబడి ఉన్న వారిని బరిలోకి దింపడానికి చర్చలు జరుపుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల్లో పట్టు నిలుపుకోవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై వివిధ అంశాలపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంటుందని భావిస్తూ అభ్యర్థుల ఎంపికపై విభిన్న రీతిలో సర్వేలు చేశారు.

అనుకూలించిన రిజర్వేషన్లతో ముందుకు

జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లలో అనుకూలంగా మారిన ఆశావాహులు ఆయా పార్టీల పెద్దలు భరోసాతో గ్రామీణ ప్రాంతాల్లో మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామాల్లో కుల సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు ఇతర గ్రామపెద్దలతో సమావేశాలు అవుతున్నారు. గతంలో రిజర్వేషన్లు అనుకూలించక ఈసారి కలిసి వచ్చిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు. ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో రిజర్వేషన్ల వారీగా కాంగ్రెస్, బీఆర్ఎస్ బీజేపీ పార్టీలు అభ్యర్థుల జాబితాలను రూపొందిస్తూ అధిష్టానానికి పంపించే ప్రక్రియను చేపట్టింది. జిల్లాలో 12జడ్పీటీసీ స్థానాల్లో వచ్చిన రిజర్వేషన్లలో జడ్పీటీసీ స్థానాలు 12ఉండగా ఎస్టీలకు ఒకటి, ఎస్సీలకు మూడు కేటాయించగా ఒకటి మహిళ, రెండు జనరల్, బీసీలకు ఐదు కేటాయించగా రెండు మహిళలకు, మూడు జనరల్, మూడు జనరల్ ఉండగా ఒకటి మహిళలకు, రెండు జనరల్ స్థానాలుగా ఉన్నాయి. జడ్పీ ఛైర్మన్ ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేశారు. 123 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీలకు 7, ఎస్సీలకు25, బీసీలకు 56, జనరల్ 35 స్థానాలను కేటాయించారు. ఎంపీపీల రిజర్వేషన్లలో రుద్రంగి ఎస్టీ జనరల్, ముస్తాబాద్ ఎస్సీ మహిళ, కోనరావుపేట ఎస్సీ జనరల్, వేములవాడ రూరల్ ఎస్సీ జనరల్, ఇల్లంతకుంట బీసీ మహిళ, బోయినపల్లి బీసీ మహిళ, గంభీరావుపేట, వేములవాడ అర్బన్, ఎల్లారెడ్డిపేట బీసీ జనరల్, వీర్నపల్లి మహిళా జనరల్, చందుర్తి, తంగళ్ళపల్లి జనరల్ రిజర్వ్ చేశారు. 260 సర్పంచ్ స్థానాల్లో ఎస్టీలకు 30, ఎస్సీలకు53, బీసీలకు 101, జనరల్ 76 స్థానాలను కేటాయించారు.

పట్టు సాధించాలని పార్టీల దృష్టి

స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని ఆయా పార్టీల అధిష్టానాలు దృష్టి పెట్టాయి. జిల్లాలో వేములవాడ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాతినిధ్యం...

- మిగతా 6లో

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులు సోమవారం పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌గౌడ్, రాజిరెడ్డి, చంద్ర య్య, ఫైమద్, బాలుయాదవ్, బాల్‌రెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

రెడ్డి యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని రెడ్డి యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోగూరి గోవర్ధన్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కోశాధికారిగా మోతె మాధవరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌దే విజయం

ఇల్లంతకుంట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలే బీఆర్ఎస్ విజయానికి కారణాలు అవుతాయన్నారు. రైతులు, మహిళలు ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీని విజయం వైపు నడిపించాలని అన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న సంజీవ్

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట),అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు గొడుగు సంజీవ్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టడం వల్ల తమ ఉపాధి దెబ్బతిందని అన్నారు. మండలంలోని అడవిపదిర గ్రామానికి చెందిన నాంపల్లి సతీష్ ఆటో నడవక అప్పుల పాలై ఈ నెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడని పేర్కొన్నారు. ఉపాధి లభించక ఆటో డ్రైవర్ల కుటుంబాలు పస్తుండే పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఈఎంఐలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సంజీవ్ కోరారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సతీష్‌ను పరామర్శించారు. సంఘం నాయకులు నవీన్, లింబాద్రి, బాబు, లక్ష్మణ్, నితీష్, లచ్చయ్య, నర్సయ్య, అంజి, రాజిరెడ్డి, శ్రీను, లింబ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మున్నూరు కాపు సంఘం కార్యవర్గం



రాజేందర్, అధ్యక్షుడు

గంభీరావుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ఛత్రపతి శివాజీ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా వేశాల రాజేందర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చల్లాపురం దేవయ్య, పొన్నాల అంజయ్య, అక్కపల్లి బాలయ్య, నాయ కాపు నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్, కోశాదికారిగా వేశాల రాజు, సంయుక్త కార్యద ర్శులుగా పొన్నాల సంతు, ఆకుల ప్రశాంత్, కొట్టె బాలరాజు, సలహాదారులుగా కూర సురేష్, పర్శరాములు, వేశాల రమేష్, సత్యనారాయణ, రామచంద్రం, చిన్న రామ చంద్రం ఎన్నికయ్యారు.

మద్దికుంటలో సీపీఐ జెండా ఆవిష్కరణ



మద్దికుంటలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ముస్తాబాద్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికుంట గ్రామంలో సోమవారం సీపీఐ జెండా ఆవిష్కరించారు. గ్రామ శాఖ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించి సీపీఐ జెండాను అధ్యక్షుడు కంచర శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా నాయకుడు గుంటి వేణు మాట్లాడుతూ యాసంగిలో కొన్న వరి ధాన్యానికి రూ 500 బోనస్ అందిస్తానని తెలిపిన కాంగ్రెస్ సర్కార్ అందించలేదన్నారు. సిరిసిల్ల జిల్లాలో నాలుగు కోట్ల 62 లక్షల రుపాయాలను రైతాంగానికి డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, రాజేందర్, కమలాకర్, చందు, రాజేందర్, బాలరాజు, కనుకయ్య, ప్రబాకర్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయ క్లినిక్ ప్రారంభం



న్యాయ సహాయ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్

- జిల్లా న్యాయ సేవాధికరసంస్థ కార్యదర్శి

సిరిసిల్ల క్రైం, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సహాయ క్లినిక్‌ను, డి-అడిక్షన్, రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం రాజీవ్‌నగర్‌లోని బస్తీ దవాఖా నాలో న్యాయసహాయ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికర సంస్థ ఆదేశాలతో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ మార్గ దర్శకత్వంలో, వైద్య శాఖ, పోలీస్‌శాఖ సమన్వయంతో న్యాయ సహాయ క్లినిక్‌ను నెలకొల్పనున్నారు. ఈ న్యాయ సహాయ కేంద్రం నిరుపేదలకు ఉచితంగా న్యాయసహాయ సేవలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, మానసిక వైద్య నిపుణులు ప్రవీణ్, వైద్యాధికారి మణివర్మ, స్వాతి పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ముందుకెళ్లాలి

- కలెక్టర్ ఎం హరిత
- ఖరీఫ్‌పై రైస్ మిల్లర్లతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరిత



సమీఓ సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు

సిరిసిల్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎం హరిత ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణ, బ్యాంక్ గ్యారంటీ, సీఎంఆర్ సరఫరా తదితర అంశాలపై రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు సీఎంఆర్ సరఫరా చేయాలని ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ నెల మూడో వారంలో జిల్లాలో వరి కోతలు మొదలు కానున్నాయని తెలిపారు. ఈ సీజన్లో జిల్లాలో దాదాపు 2.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నదని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం మిల్లులకు ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు. పలువురు రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్‌సిఐకి బియ్యం ఇచ్చేందుకు బెడ్స్ ఇప్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించగా, ప్రభుత్వ నిబంధవల ప్రకారం మిల్లర్లకు సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి చంద్రప్రకాష్, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ రహదారి డీపీఆర్‌పై సమీక్ష

సిరిసిల్ల టౌన్ : గ్రీన్ ఫీల్డ్ నాగపూర్ - హైదరాబాద్ హైస్పీడ్ కారిడార్ అభివృద్ధికి డీపీఆర్ నమూనాపై సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో కలెక్టర్ ఎం హరితతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మహారాష్ట్ర - తెలంగాణ రాష్ట్రంలో విజన్ - 2047లో భాగంగా జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్ కింద నాగపూర్ నుంచి హైదరాబాద్ వరకు హై స్పీడ్ కారిడార్ అభివృద్ధికి డీపీఆర్ ఏ విధంగా ఉండాలనే దానిపై అధికారులతో చర్చించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌తో పాటు ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

జంట జామ



సిరిసిల్ల విద్యానగర్‌లో జిందం అరుణ్ ఇంటి ఖాళీ స్థలంలో ఉన్న జామ చెట్టుకు కాసిన జంట జామకాయలు ఆకట్టుకున్నాయి. వీటిని కొందరు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్‌గా మారాయి.

- సిరిసిల్ల టౌన్

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ ఎదుట ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నిరసన



మున్సిపల్ ఎదుట నిరసన తెలపుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రోడ్లు, నాలాల ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సోమవారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐఎఫ్‌టీయూ(న్యూ) నాయకులు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ ఖదీర్‌పాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ (న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం విద్యానగర్ నుంచి తాడూరు వెళ్లడానికి గతంలో 33.6 ఫీట్ల రోడ్డను లేఅవుట్ స్థలంగా వదిలేయడం జరిగిందన్నారు. విద్యానగర్ నుంచి తాడూరు వెళ్లే 33.6 ఫీట్ల రోడ్డును కొందరు కబ్జా చేసి బిల్డింగ్ కడుతున్నారని గతంలో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో నిరసన తెలిపి మరోసారి కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆదే విధంగా సిరిసిల్ల కొత్త చెరువుకు సంబంధించిన నాలాల ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకో వాలని అన్నారు. నాలాలు కబ్జా కావడంతో వర్షం నీరు శాంతినగర్ గృహాలలోకి వస్తుండ డంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీ యూ(న్యూ)జిల్లా నాయకులు కొంపెల్లి విజయ్ కుమార్, తడుక రాములు, గుజ్జ దేవదాస్, ఏ సత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.



చీరల ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

నేతన్నలకు నిరంతరం ఉపాధి

- వచ్చే నెలలో స్వశక్తి మహిళలకు చీరల పంపిణీ
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

5

మిగిలింది 12 రోజులే..

- వైన్స్ టెండర్లకు నామమాత్రపు స్పందన
- 10 రోజుల్లో 65 దరఖాస్తులు
- అమ్మకాలు ఉన్న వైన్స్‌కే డిమాండ్



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సిరిసిల్లక్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైన్స్ షాపుల టెండర్లకు స్పందన అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ, ఎలారెడ్డిపేట సర్కిల్ పరిధిలో 48 వైన్స్ ఉన్నాయి. ఇందులో 10 గౌడ్స్, 5 ఎస్సీలకు రిజర్వు అయ్యాయి. 2023-25లో ఇప్పటివరకు జిల్లాలో రూ. 961 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఎక్సైజ్ పాలసీలో దరఖాస్తు ఫీజు రూ. 2లక్షలు ఉండడంతో 2,036 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా రూ.40.72 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి సెప్టెంబర్26న వైన్స్ టెండర్ ప్రారంభం అయింది. 10 రోజులైనా ఇప్పటి వరకు కేవలం 65 దరఖాస్తులే వచ్చాయి. ఇంకా దరఖాస్తుల దాఖలుకు 12 రోజులు గడువు మిగిలి ఉంది. గతంలో వైన్స్‌లు దక్కించుకోవడానికి పోటీ విపరీతంగా ఉండేది. ప్రస్తుతం జిల్లాలో మద్యం అమ్మకాలు ఎక్కువ ఉన్న వైన్స్‌కే డిమాండ్ ఉంది. ప్రస్తుతం మద్యం వ్యాపారుల స్పందన కనిపించడంలేదు. ఇందుకు దరఖాస్తు ఫీజు రూ. 3లక్షలు పెంచడమే కారణమని కొందరు పేర్కొంటున్నారు. అయినా ధైర్యం చేసి దరఖాస్తు చేసుకున్నప్పటికీ లక్కీడ్రాలో అదృష్టం కలిసి రావాలి. ఈ అదృష్టం కోసం ఒక్కో గ్రూప్ 10 నుంచి 100 దరఖాస్తులు చేసైనా వైన్స్‌లు దక్కించుకోవాలని ఆశపడుతున్నారు. ఇందుకు మంచి రోజుల కోసం మద్యం వ్యాపారులు చూస్తున్నారు. ఈనెల 11, 12 సెలవులు కావడంతో 10 రోజులే అవకాశం ఉంది. నేడు పౌర్ణమి కావడంతో మంచి రోజులైన ఐదు రోజులు మాత్రమే ఉన్నాయి. ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసినప్పటికీ ఎక్సైజ్ నోటిఫికేషన్ ప్రకారం వైన్స్ షాపులు దక్కే వ్యాపారులకు ఎలాంటి లాభం లేదు. ప్రస్తుతం ఉన్న మద్యం వ్యాపారులకే మరో నెల రోజులు గడువు ఉండటంతో వారికే లాభాలు రానున్నాయి. కొత్తగా దక్కే వ్యాపారులకు మున్సిపల్ ఎన్నికలు కలిసి వచ్చే అవకాశం ఉంది. మరో వైపు వైన్స్ షాపులు నడుపడం కష్టంగా ఉందని మద్యం వ్యాపారులు అంటున్నారు.

నిబంధనలు పాటించినా ప్రతి నెలా మామూళ్లు ఇవ్వక తప్పడం లేదని చెబుతున్నారు. కోట్లు ఖర్చు పెట్టి మద్యం వ్యాపారం చేస్తే మామూళ్ల బెడద మరింత నిరాసక్తిని కనబరుస్తున్నట్లు మద్యం వ్యాపారులు చెపుతున్నారు. వైన్స్‌లకు దరఖాస్తు దాఖలు చేయమని ప్రస్తుతం ఉన్న మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులు ఫోన్ చేసి ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వారి నుంచి స్పందన రావడం లేదనే చర్చ నడుస్తోంది.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, "MOHAMED MUNEERUDDIN AMEERUDDIN" S/O. LATE MOHAMED AMEERUDDIN, R/O. H.NO: 3-405, SUBHASH ROAD, ACC, MANCHERIAL. I HAVE CHANGED NAME AS "MOHAMMAD MUNEERUDDIN" S/O. LATE MOHAMMAD AMEERUDDIN.
AJK-17307

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174
ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

వేర్వేరు కారణాలతో నలుగురి బలవన్మరణం

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సోమవారం నలుగురు బలవన్మరణం చెందారు. ఆర్థిక సమస్యలతో ఒకరు.. అనారోగ్యంతో ఒకరు.. మద్యానికి బానిసై ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..


లక్ష్మణ్ (ఫైల్)

వేములవాడ క్రైం/వేములవాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో టాక్సీ యజమాని మొగిలి లక్ష్మణ్(47) గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మణ్ 15సంవత్సరాలుగా వేములవాడలో నివాసముంటున్నాడు. వాహనాలను అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం అచ్చన్నపల్లికి వెళ్లిన లక్ష్మణ్ పొలంవద్ద గడ్డిమందు తాగి పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన లక్ష్మణ్‌ను చికిత్సనిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. గతంలో పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో కుటుంబ సభ్యులను లక్ష్మణ్ బెదిరించాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమనితెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఉద్యోగి..


మల్లయ్య (ఫైల్)

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంజాల మల్లయ్య(67) అనే ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మలయ్యకు షుగరు వ్యాధిఉంది. కాలికి గాయమై కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా గాయంనయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు పంజాల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

శంకరపట్నం : మద్యానికి బానిసై గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం శంకరపట్నం మండలం ముత్తారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం గ్రామానికి చెందిన కటికిరెడ్డి సుమంత్(24) అనే యువకుడు మద్యానికి బానిసై బైక్ ఈఎంఐ కట్టలేక క్షణికావేశంతో తన పొలం దగ్గర తాగిన మైకంలో ఈనెల 5న గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అక్కడ మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న కటికిరెడ్డి సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకొని ఒకరు..

కరీంనగర్ క్రైం : కరీంనగర్‌లోని బుట్టిరాజరాం కాలనీకి చెందిన శ్రీనివాస్(39) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుట్టిరాజరాం కాలనీకి చెందిన సింగనాని శ్రీనివాస్ పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రతి రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. అదే క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి బెడ్రూం గడియపెట్టుకున్నాడు. సాయంత్రం తలుపు గడియ తెరిచి చూసేసరికి ఉరేసుకొని మృతిచెంది ఉన్నాడు. శ్రీనివాస్ భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. మండలం లోని అన్నారం గ్రామానికిచెందిన రామగిరి రాకేష్, నరేష్ అనేవ్యక్తులు మోటార్ సైకిల్‌పై లింగాపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి జగ్గయ్య పల్లి గ్రామంలో గడ్డిలోడుతో వెళుతున్న ట్రాక్టర్‌టైర్ కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రాకేష్, నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108వాహన సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. రాకేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మనోధైర్యం కల్పిస్తూ..

- మానసిక వికలాంగుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న పాఠశాల
- ఓ తండ్రి ఆలోచన.. నేడు ఎంతో మందికి ఆలంబన
- సేవకు ప్రతిరూపంగా శ్రీసత్యసాయి సేవా సదన్

జమ్మికుంట రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తన పిల్లల మానసిక వైకల్యాన్ని జయించడం కోసం ఓ తండ్రి చేసిన ఆలోచన నేడు వందల మంది మానసిక వికలాంగుల్లో మనో ధైర్యాన్ని నింపుతోంది. 1998లో జమ్మికుంట మండలం మాచనపల్లిలో శ్రీసత్యసాయి సేవా సదన్ మానసిక వికలాంగుల పాఠశాల పేరుతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాల నేడు మానసిక వికలాంగులకు వరంగా మారింది. వైకల్యం తన కుమారులను బాధిస్తుంటే ఓ తండ్రి అనుభవించిన మానసిక సంఘర్షణ ఆయన చూపిన చొరవ ఇప్పుడు వంద మంది మానసిక వికలాంగులకు ఆధారమైంది. మండలం లోని మాచనపల్లిలోని శ్రీసత్యసాయి సేవా సదన్ మానసిక వికలాంగుల పాఠశాల బుద్ధి మాంద్యంతో బాధపడే ఎందరో చిన్నారులను అక్కున చేర్చుకుంటోంది. బుచ్చి రాములు అనే వ్యక్తికి మానసిక వికలాంగులైన ఇద్దరు కుమారులు ఉన్నారు.

వారికి చదువు చెప్పించేందుకు, ఇతర విషయాల్లో అతడు చాలా ఇబ్బందులు పడ్డాడు. వారిని పాఠశాలల్లో చేర్పిస్తే ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. ఇన్ని ఇబ్బందులు భరించే బదులు తానే మానసిక వికలాంగుల కోసం ఓ పాఠశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాడు. అలా ఏర్పడిందే శ్రీసత్యసాయి సేవా సదన్.



తన బిడ్డల భవిష్యత్తుకు చక్కటి మార్గ నిర్దేశనం అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ఇప్పుడు ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. నా అన్నవాళ్లు లేని అనాథలకు అమ్మ నాన్న అయింది. 1998లో ఏర్పడిన ఈ సంస్థ ఎంతో మంది మానసిక వికలాంగుల భవిష్యత్తుకు పునాది వేసింది. రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో ఇప్పుడు 95 మంది విద్యార్థులున్నారు.


దివ్యాంగ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

దాతల సహకారంతో..

రెండు ఎకరాల్లో ఎకరం 10 గుంటలు ప్రభుత్వ భూమి కాగా గ్రామానికి చెందిన పత్తి వీరారెడ్డి మరో 30 గుంటలు విరాళంగా ఇచ్చారు. ఎంతో మంది దాతల సహకారంతో ఈ సంస్థ ముందుకెళుతోంది. మానసిక వికలాంగ విద్యార్థులకు తమ కాళ్లపై తాము నిలబడడానికి తోడ్పాటునందిస్తోంది. ప్రస్తుతం పాఠశాలలో 50 మంది ఉండగా, 30 మంది హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్‌లో ఉండేవారిలో 10మంది అనాథ పిల్లలు ఉన్నారు. వారిని పాఠశాల నిర్వాహకులు అన్నీ తామై చూసుకుం టున్నారు. బెంగళూర్‌కు చెందిన ఏఎంబీఏ అనే స్వచ్ఛంద సంస్థ ఇద్దరు విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఒక ల్యాప్‌టాప్ ఉచితంగా అందించింది.

పాఠశాలలో పది మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వారంతా మానసిక వికలాంగులకు బోధించే స్పెషల్ బీఈడీ అర్హత ఉన్నవారే. ప్రిన్సిపాల్ పి కుమారస్వామి ఆధ్వర్యంలో 24 గంటల పాటు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థుల దినసరి ఖర్చులను సైతం సంస్థ సమకూరుస్తుంది. విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి విద్యా శిక్షణ అందజేస్తుంది. ఫైళ్లు, ప్యాడ్స్, ప్లాస్టిక్ కవర్స్, ఎక్స్‌రే కవర్స్, డైరీ, స్ర్కీన్, ప్రింటింగ్, ఫినాయిల్ తయారీపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. వీటి తయారీ ద్వారా సంపాదించిన మొత్తాన్ని విద్యార్థుల పేరుతో పోస్టాఫీసులో ఖాతా తెరిచి జమ చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో పండ్ల మొక్కలు పెంచుతున్నారు. కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రత్యేక నిపుణులైన వైద్యులతో నెలకొకసారి పరీక్షలు చేయిస్తూ అవసరమైన వారికి చికిత్సలు అందిస్తున్నారు. సత్యసాయి సేవా సదన్‌లో విద్యాభ్యాసం చేసిన ఎందరో ఉన్నత చదువులు చదువుతున్నారు.

వికలాంగుల భవిష్యత్తే లక్ష్యం
బుచ్చి రాములు, ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకుడు



మానసిక వికలాం గులకు భంగారు భవిష్య త్తు చూపించడం కోసం ఆశ్రమ పాఠశాల స్థాపించాను. విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయులను ఏర్పాటు చేశాం. వారు నిత్యం విద్యార్థుల చదువుపై శ్రద్ధ చూపిస్తుంటారు. తమ పాఠశాలలో చది విన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతు న్నారు. బీటెక్, అగ్రికల్చర్ బీఎస్సీ, బీఎస్సీ డైయిరీ సైన్స్, పాల్‌టెక్నిక్ పూర్తి చేశారు. ఒక యువతి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉద్యోగం లో చేరింది. దాతల సహకారంతో విద్యార్థు లకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూస్తున్నాం.


భోజనం చేస్తున్న విద్యార్థులు

సైబర్ క్రైం కేసులో ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో జరిగిన సైబర్‌క్రైంకు సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న కరీంనగర్‌కు చెందిన కార్తిక అనేవ్యక్తిని అక్కడి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సైబర్‌క్రైం కేసులో ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు ఒడిశా సైబర్‌క్రైం పోలీసులు ఆదివారం కరీంనగర్‌కు వచ్చి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరోఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని పోలీసులు ఒడిశాకు తీసుకెళ్లినట్లు తెలిసింది.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

మల్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ట్రాక్టర్‌ట్రాలీ బోల్తాపడింది. మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడగా డ్రైవర్, మరొకరు ట్రాక్టర్ నుంచి కిందకు దూకారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదని స్థానికులు తెలిపారు. మూలమలుపుకు కొద్ది దూరంలో బోర్‌వెల్ వాహనం ఉండడంతో దానిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పినట్లు పేర్కొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు

- మట్టి పనులు, కల్వర్టుల నిర్మాణానికే పరిమితం
- ప్రమాదకరంగా మారిన జైనా-దొంతాపూర్ రోడ్డు


జైనా గ్రామంలో అధ్వానంగా మారిన రోడ్డు


ఇబ్బందులు పడుతూ బైక్‌పై వెళ్తున్న గ్రామస్థులు

ధర్మపురి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని జైనా-దొంతాపూర్ రోడ్డువిస్తరణ పనులు రెండేళ్లుగా ముందుకు కదలడం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు విస్తరణకు గత ప్రభుత్వం 32కోట్లరూపాయలు మంజూరు చేసింది. మట్టి పనులు ప్రారంభించి సిమెంట్ కల్వర్టులు నిర్మించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిపి వేశారు. జైనా-దొంతాపూర్ గ్రామాల మధ్య ఇటీవలకురిసిన వర్షానికి రోడ్డుఅధ్వానంగా మారింది. రోడ్డుపై వర్షపు నీరునిలిచి గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు, పాఠశాలకు వెళ్లే ఆటోలు, కాలి నడకగా వెళ్లే మనుషులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చొరవ తీసుకుని రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- కుక్కల గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ, జైనా



జైనా-దొంతాపూర్ రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రెండేళ్లుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

కుక్కదాడిలో మహిళకు తీవ్ర గాయాలు

భీమారం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో వాసం గంగు(56)పై సోమవారం కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. గంగు ఇంట్లో పడుకొని ఉండగా కుక్క లోనికి చొరబడి విచక్షణారహితంగా దాడిచేసింది. దీంతో గంగు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


తీవ్రంగా గాయపడిన గంగు

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ హెల్పర్‌కు తీవ్ర గాయాలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని బంగిరెడ్డి తండా శివారులో వ్యవసాయ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్‌వైర్ వేస్తుండగా సోమవారం అసిస్టెంట్ హెల్పర్ భూక్య పరమేశ్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయప డ్డాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోవడంతో అక్కడే ఉన్న రైతులు అప్రమత్తమై ఆయనను కిందకు దింపారు. తీవ్ర గాయాలపాలైన పరమేశ్‌ను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బంగిరెడ్డి తండా శివారులోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంటు సరఫరా కాకపోవడం వల్ల మరమ్మతు పనులు చేసేందుకు అసిస్టెంట్ హెల్పర్ పరమేశ్ పైకి ఎక్కాడు. సెస్ అధికారులు, సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని పరమేశ్‌ను పరామర్శించారు. జరిగిన ఘటన తీరును అడిగి తెలుసుకున్నారు. పరమేశ్‌కు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బంది, కుటుంబసభ్యులు కోరారు.


విద్యుదాఘాతానికి గురైన పరమేశ్‌ను కిందికి దింపుతున్న రైతులు, అధికారులు

23 గ్రామాలకు.. ఒక్కటే పశు వైద్యకేంద్రం

పెగడపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలో 23 గ్రామాలకు గాను ఒక్కటే పశువైద్యశాలతో మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. మండలంలోని 23గ్రామాలకుగాను మండలకేంద్రంలో మాత్రమే ఒక్క పశువైద్య కేంద్రం ఉండగా 22 గ్రామాల పశువులకు ఇక్కడే వైద్యం అందించాల్సి ఉంది. గాలికుంటు వ్యాధి టీకా లాంటి ప్రత్యేక కార్యక్రమాలప్పుడు మినహా నిత్యం మూగజీవులకు వైద్యం అందించాల్సి వస్తే మండల కేంద్రానికి మూగజీవులను తీసుకుని రావాల్సిందే. మండలంలో ఎల్లాపూర్, ఆరవెల్లి, నంచర్ల గ్రామాల్లో పశువైద్య ఉప కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ మంజూరు కాలేదు. ఉన్న ఒక్క పశువైద్య కేంద్రంలో ఒక డాక్టర్, ఒక పశువైద్య సహాయకులు, ఆఫీస్ సబార్డినేట్ మొత్తం ముగ్గురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. మండలంలో 1,693 ఆవులు, ఎద్దులు, 3,347గేదెలు, దున్నెలు, 23,602గొర్రెలు, మేకలు, వేలాది కోళ్లు ఉన్నాయి. ఒక్క వైద్యాధికారితో మూగజీవులకు వైద్యం ఎలా అందుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. పశువైద్య ఉప కేంద్రాల ఏర్పాటుతో పాటు పశువైద్య సిబ్బందిని పెంచాలని మండల రైతులు కోరుతున్నారు.


పెగడపల్లి పశు వైద్యకేంద్రం

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్స్ అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించిన పోలీసులు సోమవారం బాధితుడికి అప్పగించారు. మార్చి 6న అన్నోజు శ్రీనివాస్ తన సెల్ ఫోన్‌ను చల్మెడ ఆనంద్‌రావు ఆసుపత్రిలో పోగొటుకున్నాడు. కరీంనగర్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్ నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు రికవరీ చేశారు. సోమవారం రూరల్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి ఆ ఫోనును యజమాని శ్రీనివాస్‌కు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.


బాధితుడికి మొబైల్ ఫోన్‌ను అప్పగిస్తున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్

తిమ్మాపూర్ : సంవత్సరం క్రితం పోగుట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సీఐఈఆర్ పోర్టల్‌ద్వారా పట్టుకొని బాధితుడికి సోమవారం అప్పగించారు. మండలంలోని జుగుండ్ల గ్రామానికి చెందిన జాల నర్సయ్య సంత్సరంకింద తన మొబైల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐఈఆర్ పోర్టల్‌ద్వారా మొబైల్ ఫోన్‌ను కనుగోని బాధితుడు జాల నర్సయ్యకు అందజేశారు.

నేడు 'రేవా' ఆధ్వర్యంలో ధర్నా

కరీంనగర్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిల సాధన కోసం రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం(రేవా) నిర్వహించతలపెట్టిన కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా మాజీఅధ్యక్షుడు జాలి మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. 2024 మార్చి తర్వాత రిటైర్డు అయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఇన్‌ఆన్స్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాడ్యుటీ ఇవ్వలేదన్నారు. వెంటనే ఆ మొత్తాన్ని ప్రభుత్వం రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా మద్దతు ఇచ్చి పదవీ విరమణ పొందిన హక్కుల సాధనకు సహకరించాలని కోరారు. ఉమ్మడిజిల్లా పరిధిలోని కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన 2024 మార్చి తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేసి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

వెంకన్న ఆలయంలో వెండి కిరీటాలు చోరీ

వేములవాడ క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ పరిధిలోని అగ్రహారం డెయిరీ వెనకాల గల చీర్లవంచ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సీసీ కెమెరాలను తొలగించి ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. ఆలయంలో స్వామివారి మూడు వెండికిరీటాలు, సీసీ కెమెరాలు, మానిటర్ ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఆలయ చైర్మెన్ నార్ల రాజేశం వచ్చి చూడగా ఆలయం తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వేములవాడ పట్టణసీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆలయానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

పాలకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్ ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. తలుపులకు ఉన్న బోల్టులను తొలగించి కేంద్రంలోకి ప్రవేశించి కోడిగుడ్లను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం పాఠశాలను తెరిచేందుకు వెళ్లిన కేంద్రం నిర్వాహకు రాలు కొలిపాక ఉమ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూపర్‌వైజర్ సువర్ణ కేంద్రాన్ని సందర్శించారు. ఇటీవల అంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామంలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరికి మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమన్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్‌సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లకు చెందిన ఆడెపు లక్ష్మణ్ 7 అక్టోబర్ 2017న ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి ఓవివాహానికి వెళ్లాడు. ఇంటితాళం పగులగొట్టి బీరువాలో ఉన్న దాదాపు 4తులాల బంగారం మువ్వల హారం, ఒక బంగారు కమ్మలు జత, ఒక రింగ్, ఒక నాగపనిని దొంగలు ఎత్తుకుపోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటిఎస్ఐ అంజయ్య కేసు నమోదుచేశారు. ఈకేసులో సీఐ శ్రీనివాస్ దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేలుమల సందీప్ కేసు వాదించారు. పరిశీలించిన న్యాయ మూర్తి ప్రవీణ్ సిరిసిల్ల పట్టణం అంబికానగర్‌కు చెందిన బొడ్డు సాయి, జేపీ నగర్‌కు చెందిన పూదరి రాజుకు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా విధించినట్లు సీఐ కే కృష్ణ తెలిపారు.

తల్వార్ తిప్పిన వ్యక్తిపై కేసు

పాలకుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముంజంపల్లిలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో తల్వార్‌తో చిందులు వేసిన బైరం హరీష్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్ స్వామి సోమవారం తెలిపారు. శుక్రవారం ముంజంపల్లిలో దుర్గామాత ఊరేగింపు జరుగుతుండగా బైరంహరీష్ తల్వార్‌తో విన్యాసాలుచేసి ప్రజలను భయాభ్రాంతులకు గురిచేశాడన్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎన్నికల నియమనిబంధనలు అమలులో ఉన్నందున బెల్ట్‌షాపులు నిర్వహించినా, పోలీస్ ఆంక్షలను అతిక్రమించినా చట్టరిత్యా చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష, మరో పదిమందికి రూ.20వేల జరిమానాను గోదావరిఖని రెండవ అదనపున్యాయమూర్తి వెంకటేష్ గురువ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు తెలిపారు.

వడ్లూరి రాజశేఖర్ అనే ఆటోడ్రైవర్ మద్యం తాగి రెండోసారి పట్టుబడగా రాజశేఖర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు, 10మందికి రూ.20వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

రైతు నేస్తం..

పొలాస వ్యవసాయ పరిశోధనా కేంద్రం



పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

- ఉత్తర తెలంగాణకు తలమానికం
- అనుబంధంగా వ్యవసాయ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలు

జగిత్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అభివృద్ధి, రైతుల శ్రేయస్సు ధ్యేయంగా జగిత్యాల జిల్లాలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పని చేస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పొలాసలో గల వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో బీఎస్సీ, ఎంఎస్సీ అగ్రికల్చర్ స్పెషలైజేషన్, జెనెటిక్స్ తదితర కోర్సులను అంది స్తున్నారు. కళాశాలలో అకడమిక్ భవనంతో పాటు ప్రయోగశాల, లైబ్రరీ, క్యాంటిన్, బాలుర, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. ఇక్కడ వ్యవసాయ కోర్సును పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోని వివిధ ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. దీనికి తోడు ఎప్పటికప్పుడు అధిక దిగుబడిని అందించే కొత్త వంగడాలను సృష్టిస్తూ పరిశోధన స్థానం తనదైన ప్రత్యేక తను చాటుకుంటోంది.

ప్రత్యేకత..

రాష్ట్రంలో పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రానికి ప్రత్యేక స్థానం ఉంది. 1983 సంవత్సరంలో పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి నం దమూరి తారకరామారావు పరిశోధన స్థానాన్ని ప్రారంభించారు. సుమారు 48.96 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఉంది. ఈ కేంద్రం పరిధిలో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిశోధన క్షేత్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు పని చేస్తున్నాయి. ఈ పరిశోధన స్థానం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన రైతులకు అవసరమైన సేవలు అందిస్తోంది. కళాశాలలో నూతన వంగడాలపై పరిశోధనలు చేస్తూ, రైతులకు సాగులో మెళకువలు చెప్తూ రైతు నేస్తంగా పొలాస వ్యవసాయ పరిశోధన క్షేత్రం కృషి చేస్తోంది.

2008లో వ్యవసాయ డిగ్రీ కళాశాల..

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా 2008 సంవత్సరంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల, 2013 సంవత్సరంలో వ్యవసాయ పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు అయ్యాయి. వ్యవసాయ కళాశాలలో 150 సీట్లు, పీజీలో 14 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలో ప్రవేశం పొందుతున్న వారిలో అధికంగా బాలికలు ఉంటున్నారు. అనంతరం బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ప్రారంభమైంది. విద్యార్థులకు రూ.20 కోట్లతో పక్కా భవనం నిర్మాణం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలో ప్రతీ యేటా సుమారు 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందు తున్నారు. ఒకే ప్రాంగణంలో వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఉండడం వ్యవసాయ విద్యావ్యాప్తికి దోహదపడుతుంది.

మేలైన వంగడాలకు కేరాఫ్..

నాణ్యమైన వంగడాలపై పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. రాష్ట్రంలో వరి పరిశోధనలకు కేంద్రబిందువుగా నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా జగిత్యాల జిల్లాలో గల పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పనిచేస్తుంది. ఇక్కడ రూపొందించిన విత్తనాలు తెలంగాణతో పాటు ఉత్తర భారతదేశంలో సాగులో ఉండడం గమనార్హం. ఇక్కడి నుంచి వరిలో జగిత్యాల సన్నాలు, పొలాస ప్రభ, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, జగిత్యాల మసూరి, ప్రాణహిత, మానేరు, బతుకమ్మ రకాలను విడుదల చేశారు. నువ్వుల్లో హిమచందన, రాజేశ్వరీ, స్వేతాతిల్, పసుపులో సుగుణ, సుదర్శన వేరు శనగలో జేజీఎల్ 98 రకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. పంటల సరళి, కొత్తకొత్త రకాలతో ఈ పరిశోధన స్థానం విశేష స్థానం పొందింది. ఈ వంగడాలన్నీ ఉల్లికోడును, అగ్గి తెగులును సమర్థవంతంగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఉన్నవే కావడంతో రైతుల్లో మంచి స్పందన లభిస్తోంది.

సమస్యలను అధిగమిస్తూ...

2014కు ముందు శాస్త్రవేత్తలు లేక వెలవెల బోయిన పరిశోధన స్థానం నేడు ఏడీఆర్‌తో పాటు 10 మంది శాస్త్రవేత్తలు, ఏడుగురు నాన్ టెక్నికల్ స్టాఫ్‌తో సందడిగా మారింది. తొలినాళ్లలో అవసలు, అసౌకర్యాలతో ఇబ్బందులు పడ్డ పరిశోధన స్థానం నేడు అన్ని హంగులతో వ్యవసాయ రంగంలో ఒక దివిటీగా వెలుగుతూ జిల్లాకే తలమాణికంగా నిలుస్తోంది. కార్యాలయ నిర్వహణతో పాటు, పరిశోధనలకు సైతం ఊతం ఇస్తూ వంగడాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ముందు వరుసలో ఉన్నారు. ఏటా విత్తన మేళా నిర్వహించి రైతులకు అవసరమైన విత్తనాలను అందిసున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాలకు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద పండే పంటలైన వరి, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ పంటలకు సం బంధించి అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, కీటకాలు, చీడపీడలను, వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడి, రైతుకు లాభాలు ఇచ్చే పంటల విత్తనాలను పరిశోధన కేంద్రంలో కనిపెడుతున్నారు. వీటిని రైతులతో పాటు ప్రభుత్వం ద్వారా ప్రైవేటు విత్తన సంస్థలకు అందజేస్తారు. జగిత్యాల పరిశోధన స్థానంలో తయారైన పలు వరి, మొక్కజొన్న, నువ్వు విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయంటే పరిశోధనల ఫలితం, శాస్త్రవేత్తల కృషికి అద్దం పడుతున్నాయి.



వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ సేవా పతకం



రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మణిసాయి వర్మ

వేములవాడ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలిడుంగుపల్లి గ్రామానికి చెందిన వంగళ్ల మల్లేశం భాగ్య దంపతులకు మారుడు మణిసాయి వర్మ ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో సోమవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ సేవా పతకం అందుకున్నాడు. మనిసాయి వర్మ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. అతడి సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక మైన అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, పలు వురు నాయకులు మనిసాయి వర్మకు అభినందనలను తెలిపారు.

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా నరేంద్ర



మంథని, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అస్సాంలోని గౌహతిలో జరిగే ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు మం థనికి చెందిన అచ్చి నాగనరేంద్ర లైన్ అంపైర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ అఫ్ ఇండియా నుంచి అధికారిక ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అంపైర్‌గా సేవలందించినందుకు ఈ పోటీలకు ఎంపిక చేశారన్నారు. నాగనరేంద్ర ఎంపికపై పలు వురు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సారెస్పీకి 1,01,480 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 26 గేట్లు ఎత్తి 1,01,480 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు సోమవారం 3,800 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. వరద కాలువ ఇన్‌లెట్స్, ములవాగు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతుంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 27.017 టీఎంసీల నీరు ఉన్నది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎండీ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. మోయతుమ్మెద వాగునుంచి 4655 క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 3500క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 640 క్యూసెక్కులు మొత్తం 8795క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తుండగా, ఎల్‌ఎండీ 4 స్పిల్‌వే గేట్ల నుంచి 8 వేలు క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి 2వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 277క్యూసెక్కులు మొత్తం 10,277 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీ నుంచి బయటకు ఆవుట్‌ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

భక్తజన సంద్రంగా రాజన్న ఆలయం

కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామివారలకు ఎంతో ఇష్టమైన సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మ గుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ఆయ్యా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు ముందుగా శ్రీలక్ష్మీగణపతిని తరువాత శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతికరమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. పరివారం దేవతల ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొని తమ మొక్కులను చెల్లించుకుని తరించారు. రాజన్న దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు.

రాజన్న సేవలో హాకీ క్రీడాకారిణి సౌందర్య



కుటుంబ సభ్యులో కలిసి ప్రత్యేక పూజలో పాల్గొన్న క్రీడాకారిణి సౌందర్య

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని భారత హాకీ క్రీడాకారిణి సౌందర్య సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆమె ముందుగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. నిజమాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సౌందర్య చిన్నతనం నుంచి రాజన్న ఆలయానికి వస్తున్నట్లు తెలిపారు.

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్‌కు జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు.ఇటీవల హనుమకొండలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో డి.రణధీర్ చరణ్ అండర్-18 విభాగంలో, సీహెచ్ సునీత చంద్ర అండర్-16 విభాగంలో ప్రతిభ కనబర్చారు. ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వ హించనున్న 41వ జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్య క్షుడు నందెల్లి మహిపాల్, సంఘం సభ్యులు చంద్రశేఖర్, హరికిషన్, ఎస్.రమేష్, బి.రాజగోపాలచారి, శ్రీనివాస్, డాక్టర్ ఇజాజ్ అహ్మద్ అభినందించారు.

నేతన్నలకు నిరంతరం ఉపాధి

- వచ్చే నెలలో స్వశక్తి మహిళలకు చీరలు
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క





చీరలతో మంత్రి సీతక్క,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చీరలను పరిశీలిస్తున్న సీతక్క

సిరిసిల్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నేతన్నలకు నిరంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్వశక్తి సంఘాల మహిళలకు అందించే ఇందిరా మహిళా శక్తి ఏక రూప చీరల బట్ట ఉత్పత్తిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యార్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు పవర్ లూమ్. కార్మికులతో మాట్లాడారు. వారికి లభిస్తున్న కూలి ఇతర విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో సీతక్క మా ట్లాడుతూ నేతన్నల సుఖసంతోషాలను స్వయంగా చూడటం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ ఆదేశాలతో నేతన్నలకు 64 లక్షల చీరలు ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో నేతన్నలకు మరిన్ని అర్డర్లు ఇస్తామని అన్నారు.

నేతన్నలకు ఉపయోగ పడే యరన్ డిపో 50 కోట్లతో వేములవాడలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం పెట్టిన నేతన్న బకాయిలు ప్రజా ప్రభుత్వం తీర్చిందన్నారు. కోటి మంది మహిళను కోటీశ్వరులను చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారని, మహిళలకు పెట్రోల్ బంకులు,సోలార్ ప్లాంట్ ,ఆర్టీసీ బస్సులు, బస్సులో ఉచిత ప్రయాణం వంటి అనేక కార్యక్ర మాలు అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఆదాయాన్ని సమకూర్చడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందని,మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై కొందరు సుప్రీంకోర్టుకు, మరి కొందరు హైకోర్టుకు వెళ్లారని, సుప్రీం కోర్టు తిరస్కరించిందని హై కోర్టులో కూడా బీసీలకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని ఆశాభావంతో ఉన్నామన్నారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం పాటిస్తూ రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారంరెడ్డి బిడ్డ అయినప్పటికీ రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కులగణన ద్వారా రిజర్వేషన్లను అసెంబ్లీలో ఆమోదింప చేశారని అన్నారు. గవర్నర్ వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉండడం ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. దాదాపుగా రెండు సంవత్సరాలుగా ఎన్నికలు లేకపోవడంతో సర్పంచ్, ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధికుంటూ పడుతుందన్నారు.

నోటిఫికేషన్ ఇవ్వడంతోనే కొందరు హైకోర్టు, మరి కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టులో తిరస్క రించడం జరిగిందని, హైకోర్టు కూడా బీసీ వర్గాలకు, ప్రభుత్వం ఆశిస్తున్న 42 శాతం రిజర్వేషన్ నిర్ణయానికి అనుగుణంగానే హైకోర్టు నిర్ణయం వస్తుందని ఆశాభావంతో ఎదురుచూస్తున్నావని అన్నారు. వచ్చే నెలలో ఇందిరా మహిళా శక్తి చీరలు స్వశక్తి సంఘాల మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. మొదట 64 లక్షల మహిళకు చీరలు ఇవ్వాలని నిర్ణయించామని ప్రస్తుతం 67లక్షల వరకు పెంచడం జరుగుతుందన్నారు.

నేతన్నలను మోసం చేసిన కేటీఆర్

-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గత ప్రభుత్వం హయాంలో నెంబర్ టూగా ఉంటూ యువరాజుగా చలామణి అయిన కేటీఆర్ నేతన్నలకు మోసం చేశారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు ప్రజాప్రభుత్వంలో చెల్లించడం జరిగిందని అన్నారు.ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం చరిత్రలో సువర్ణ అధ్యాయం అన్నారు. దేశంలో 70 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఉందని,బీసీ బిల్లును కేంద్రం కావాలని అడ్డుకుంటుందన్నారు. బీసీలపై బీజేపీకి ప్రేమ లేక బీసీ బిల్లను షెడ్యూల్9లో చేర్చడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, కాంగ్రెస్ పట్టణ ఆధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు,గడ్డం నర్సయ్య, తాటి పాముల దామోదర్, ఎల్లప్ప, ఆకునూరి బాల రాజు, వనిత,శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పది శాతం యారన్ సబ్సిడీ అందించాలి

చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజరామయ్యర్‌కు వినతి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పవర్‌లూం అనుబంధ రంగాల కార్మికులకు పది శాతం యారన్ సబ్సిడీ అందించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర పర్యటనకు వచ్చిన చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను పంచాయతీ రాజ్ అతిథి గృహంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షు డు రమేష్ మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి చీరల మొదటి విడత ఆర్డర్ పూర్తి కావస్తునందున పవర్‌లూం కార్మికులకు ఉపాధికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం రెండో విడతగా ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్లు వెంటనే ఇవ్వాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. స్థానిక కార్మికులు, ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చి పనిచేసిన కార్మికులకు 2023 యారన్ సబ్సిడీ ఇవ్వలేదని ప్రభుత్వం వెంటనే వారికి సంబంధించిన పదిశాతం యారన్ సబ్సిడీ అందించాలని అన్నారు. కలెక్టరేట్ నుంచి చేనేత, జౌళి శాఖ కార్యాలయాన్ని సిరిసిల్ల పట్టణం మార్చాలని వినతి పత్రం ద్వారా కోరమన్నారు. కార్యక్రమంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, అక్తర్ అన్సారి, కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్ శైలజ రామయ్యర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మపురిలో కోజాగరి పౌర్ణమి వేడుకలు

ధర్మపురి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కోజాగిరి పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ప్రాంగణంలోని శేషప్ప కళా వేదిక వద్ద రాత్రి పాలలో చంద్రుడిని వీక్షించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక కళాకారులు, భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణయ్య, నంబి నరసింహమూర్తి, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గోవిందా.. గోవిందా..

సిరిసిల్లలో వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పొన్నవాహనంపై వారి ఊరేగింపు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పురవీధులు గోవిందా... గోవిందా వెంకటరమణ గోవిందా.. అంటూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి స్మరణతో మారు మోగింది. జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్ర హ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొన సా గుతున్నాయి. సోమవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం శ్రీవారిని కాళీయ మర్దనంపై పురవీధులో గుండా భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. రాత్రి పొన్న వాహనంపై శ్రీవారిని పు వీధుల గుండా ఊరేగించగా మహిళలు స్వామి వారికి మంగళ హారతులిచ్చి దర్శంచుకొని పొన్న వాహన సేవలో పాల్గొన్నారు.

మరి కొందరు భక్తుల గోవింద నామస్మరణలతో పురువీధులు మారుమోగాయి. మంగళవారం రథోత్సవానికి దేవాలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టా రు. ఉదయం 2గంటల నుంచి 4.30 నిమిషాల వరకు రథపుణ్యాహవాచనం, రథాంగ హోమం, పూర్ణాహుతి, ఆరాధన, సేవాలం, నివేదన అనంతరం తీర్థప్రసాదాల వితరణ నిర్వహించి శ్రీ లక్ష్మి వెంక టేశ్వర స్వామిని రథంపైకి తీసుకెళ్లి భక్తుల సందర్శన ప్రారంభిస్తారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర దేవాలయం కార్యనిర్వహణాధికారి మారుతిరావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే చోటే బ్రిడ్జి నిర్మిస్తాం..

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రజలకు ఉపయోగపడే చోటే చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ తెలిపారు. చొక్కారావుపల్లి నుంచి ఖాజీపూర్ వరకు బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లిని, కేంద్రమంత్రి బండి సంజయ్‌ని మండల ప్రజలు ఇటీవల కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో సోమవారం ఎమ్మెల్యే మండలంలోని మైలారం మైసమ్మగుట్ట, యాస్వాడ మానేరు తీర ప్రాంతాల్లో పర్యటించి బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రిడ్జిని ప్రజలకు అను వైన చోటనే నిర్మిస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉనేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్ రెడ్డి, దుడ్డు మల్లేశం, అలువాల కోటి, ఉదయ్, సునీల్, అనిల్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మైలారం మైసమ్మగుట్ట వద్ద మానేరు డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

కోనరావుపేట ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



కోనరావుపేట ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

కోనరావుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా రొక్కం దేవారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోనరావుపేట మండల కేంద్రంలో సోమవారం కోనరావుపేట ప్రెస్‌క్లబ్ ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా జొన్నల రాజేందర్, గౌరవ అధ్యక్షుడుగా మల్యాల ప్రసాద్, ఉపాధ్యక్షుడుగా కస్తూరి తిరుపతిరెడ్డి, దుంపటి నాగరాజు, గొర్రె సుధాకర్, ఎల్లే శ్రీనివాస్, ముఖ్య సలహాదారు దప్పుల కరుణాకర్, కోశాధికారిగా తాళ్లపల్లి దిలీప్, సంయుక్త కార్యదర్శి దండు దేవేందర్, గండి నరేష్, కార్యవర్గసభ్యులు తడుక శ్రీనివాస్, దప్పుల నరేష్, ఎర్రవెల్లి నరేష్, మాందాల సంజీవ్, సాసర్ల గంగాధర్, తాళ్లపల్లి శ్రీకాంత్, సాసాల సురేష్, మిర్యాల కిషన్, ఎర్రవెల్లి నరేష్, కల్యాణ్ ఎన్నికయ్యారు.

గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడికి ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జాగిరి పర్శరాములును స్థానిక గౌడ సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. గౌడ సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతానని పర్శరాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రం



విద్యార్థుల ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

చందుర్తి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదు కేంద్రంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వినయ్ కుమార్ పేర్కొన్నారు. చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కొత్త ఆధార్ కార్డు నమోదు తప్పుల సవరణ, అప్‌డేట్ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ఇతర పాఠశాలకు సంబందించిన విద్యార్థుల తమ ఆధార్ కార్డుని సవరణ, అప్‌డేట్, కొత్త కార్డ్ కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్ ఉపాధ్యాయులు ఉన్నారు.

చందుర్తిలో కిరాణా దుకాణాల మూసివేత



చందుర్తిలో మూసివేసిన కిరాణం దుకాణం

చందుర్తి అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, రామన్నపేట, తదితర గ్రామాల్లో సోమవారం కిరాణా దుకాణాలను వ్యాపారులు మూసివేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' రాజన్న సిరిసిల్ల జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన 'కాలం చెల్లిన శీతల పానీయాల విక్రయం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఫుడ్ ఇన్స్‌పెక్టర్ తనిఖీలు చేపడతారని ముందస్తుగా కిరాణా దుకాణాలతో పాటు, హోటళ్లను మూసివేశారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

వేములవాడ క్రైం, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం అన్నారు. సోమవారం వేములవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో నూతనంగా నియామకమైన అడిషనల్ పిపి అవధూత రజనీకాంత్‌ను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. న్యాయవాదులతో సమన్వయంగా ఉండాలని అన్నారు. న్యాయవాది నుంచి ఏపీపీగా ఎదగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీలు బొడ్డు ప్రశాంత్, భానుకృష్ణ, ఉపాధ్యక్షుడు కట్కం జనార్దన్, క్రీడల కార్యదర్శి గుజ్జె మనోహర్, మహిళా ప్రతినిధి పద్మ, సీనియర్ కార్యవర్గ సభ్యులు అన్నపూర్ణ, మహేష్, జూనియర్ కార్యవర్గ సభ్యులు బూర సరిత, రజనీకాంత్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రీజియన్‌లో ప్రథమ స్థానం



జితేందర్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఫ్యామిలీ క్లబ్‌గా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రథమ స్థానంలో నిలిచిందని లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్మన్ కొల్లూరి జితేందర్ అన్నారు. సోమవారం నగరంలోని విద్యానగర్‌లో లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యులు సమష్టిగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు రీజియన్ ఛైర్మన్ జితేందర్‌తోపాటు, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి బండ కిషన్‌రెడ్డి, కోశాధికారి ఠాగూర్ వందన సింగ్, రాళ్లపైన శశికళ శంకర్ ప్రసాద్‌రెడ్డి, వి.బాలకిషన్‌రావు, ముప్పిడి రాజశేఖర్‌రెడ్డి, చాడ విమల మల్లారెడ్డి, కర్ర భాగ్యలక్ష్మి, విద్యాసాగర్‌రెడ్డి, కనగర్తి శ్రీనివాస్, బండ గోపాల్‌రెడ్డి, గుండోని రామచంద్రం, లంబు రాజురెడ్డి, నంది మోహన్‌రెడ్డి, బొంగోని భాగ్య పర్శరాములు, జాడి బాల్‌రెడ్డి, కుమారస్వామి, పి.సంగీతా నారాయణరెడ్డి, ఎ.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగా పోరాటం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగానే పోటీచేస్తుందని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై పార్టీ జెండాను ఎగురవేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంఐఎం ఇన్‌చార్జి యాసర్ అరాఫత్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఎంఐఎం అధినేత అసదొద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు స్థానిక దారుస్సలాం ఎంఐఎం కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ సలీంబేగ్, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్‌హుస్సేన్‌తో కలిసి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో కార్యకర్తలను కలుపుకొని సమష్టిగా ముందుకెళ్లాలని, వర్గవిబేధాలను పక్కన బెట్టాలని సూచించారు. సర్పంచులు,జడ్పీటీసీ, ఎంపీటీసీ పోటీకి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

ఏటీసీలతో భవిష్యత్తుకు బాటలు

● అధునాతన కోర్సుల్లో శిక్షణ ● అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ ● విదేశాల్లో ఉపాధికి అవకాశం



మండెపల్లిలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్



అధునాతన యంత్రాలపై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

తంగళ్లపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): టాటా టెక్నాలజీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐల్లో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో కోర్సులు భవిష్యత్తుకు బాటలుగా నిలుస్తున్నాయి. తంగళ్లపల్లి మండలం మండేపల్లి ప్రభుత్వ ఐటీఐలో సుమారు రూ. 36 కోట్ల వ్యయంతో ఏటీసీ ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం ఆరు కోర్సులు ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సి మెషినింగ్ టెక్నీషియన్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్, అడ్వాన్స్‌డ్ టూల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సులు ఉన్నాయి. మొత్తం అన్ని కోర్సుల్లో 172 సీట్లు ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారందరూ అర్హులే. ఏటీసీలో శిక్షణ పొందిన అభ్యర్థులకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు ఉంటాయని శిక్షకులు పేర్కొంటున్నారు. టాటా టెక్నాలజీ సహకారంతో ఏటీసీలను ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచంలోని ఏడు దేశాల్లో కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. శిక్షణ పొందిన వారికి ఆయా కంపెనీలలో ప్లేస్‌మెంట్ ఇస్తుందని మాస్టర్ ట్రైనర్ సంధ్య తెలిపారు. టాటా గ్రూప్‌నకు చెందిన 16 కంపెనీలలో శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పిస్తారు.

మారుతున్న కాలంతో పరుగెత్తాలి

కవిత, ప్రిన్సిపాల్ ఐటిఐ



మారుతున్న కాలంతో పరుగెత్తాలి. ఏటీసీలో కోర్సులు రానున్న పది సంవత్సరాలలో డిమాండ్ ఉన్న కోర్సులు. విదేశాలలో సైతం ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఏటీసీలో కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి.

భవిష్యత్తులో కోర్సులకు డిమాండ్



సంధ్య, మాస్టర్ ట్రైనర్

ఏటీసీలో ప్రవేశపెట్టిన ఆరు కోర్సులకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుంది. టాటా టెక్నాలజీ ముందు చూపుతో శిక్షణ ఇవ్వాలని డబ్బులు వెచ్చిస్తోంది. ప్రభుత్వం, టాటా కంపెనీ శిక్షణకు అవసరమయ్యే అన్ని రకాల యంత్రాలను ఏర్పాటు చేసింది. అధునాతన టెక్నాలజీ ఉపయోగించి శిక్షణ ఇస్తున్నాం.

శిక్షణ ఉపయోగ పడుతుంది

శ్రీరాం అపర్ణ, విద్యార్థి



ఏటీసీలో ప్రవేశపెట్టిన కోర్సు ల్లో శిక్షణ బాగుంది. శిక్షణ తీసుకున్నాక ఉపాధి అవకశాలు ఉంటాయని ట్రైనర్స్ చెప్తున్నారు. ప్లేస్‌మెంట్ వస్తుందని నమ్మకం కుదిరింది. వచ్చే ఏడాది సీటు దొరకడం కష్టమే.

భవిష్యత్తులో ఉపాధి



- సాయి కిరణ్, విద్యార్థి

భవిష్యత్తులో ఏటీసీ కోర్సులు ఉపాధి అవకశాలు కల్పిస్తాయి. నేను ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషిన్ కోర్సు తీసుకున్నా. ఈ కోర్సు పూర్తయ్యాక టాటా కంపెనీ గ్రూప్‌లో ప్లేస్‌మెంట్ వస్తుందనే ధీమా ఉంది.



ఏటీసీలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

'స్థానిక' సందడి

(3వ పేజీ తరువాయి)

వహిస్తుండగా, సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కే తారక రామారావు ఎమ్మెల్యే ఉన్నారు. జిల్లాలోని బోయిన్‌పల్లి మండలం చొప్పదండి నియోజకవర్గంలో ఉంది ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఇల్లంతకుంట మండలం మానకొండూరు నియోజకవర్గంలో ఉండగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు చాలామంది పోటీ పడుతూ ముందుకు రావడంతో అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎంపిక చేయడం కష్టంగానే ఉంటుందని చర్చించుకుంటున్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ అన్ని స్థానాల్లో పోటీలో అభ్యర్థులు నిలిపేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని రాజన్న సిరిసిల్ల జిల్లా ఉండడంతో బీజేపీ స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించాలని ప్రయత్నాల్లో ఉంది.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

జిల్లాలో స్థానిక ఎన్నికల ఏర్పాట్లలో ముందుగా పరిషత్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలు ఉండడంతో గ్రామాల్లో రాజకీయ పార్టీల గోడ రాతలు, జెండాలు, పోస్టర్లు ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం మొదటి విడత ఈ నెల 9 నుంచి 12 తేదీ వరకు, రెండో విడత 12 నుంచి 16 తేదీ వరకు నామినేషన్లు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో తొలి విడతలో ఏడు జడ్పీటీసీలు, 65 ఎంపిటిసిలు, రెండో విడతలో ఐదు జడ్పీటీసీలు, 58 ఎంపీటీసీల ఎన్నికలు నిర్వహించడానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు.

నేడు 150వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో 150వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం 6 గంటలకు రచయిత అన్నవరం దేవేందర్ ఆతిథ్యంలో కరీంనగర్‌లోని భగత్‌నగర్, మారుతి హెవెన్స్‌లో నిర్వహించనున్నారు. వేదిక నిర్వహిస్తున్న ఎన్నీల ముచ్చట్లకు మంగళవారంతో 150 నెలలు పూర్తికానున్నాయి. ఈ సందర్భంగా కవులు, రచయితలు తమ కవితలతో హాజరు కావాలని అధ్యక్ష కార్యదర్శులు సీవి కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో కోరారు.

● తెరవే కార్య స్ఫూర్తి..

స్ఫూర్తి మిత్ర మండలి వరంగల్ వారు నిర్వహించే కవి సంగమాన్ని, కాళోజి కవితా సందేశాలను స్ఫూర్తిగా తీసుకొని 21-8-2013 నుంచి ఎన్నీల ముచ్చట్లను ప్రతి నెలా నిర్వహిస్తున్నారు. తెలంగాణ అస్తిత్వ పోరాటం, రాష్ట్ర ఆవిర్భావం కోసం జరిగిన తుది దశ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచింది. కవితా స్ఫూర్తిని పంచుతూ వివిధ సందేశాలను పలు దేశాల వరకూ పంచుతూ సాహిత్యంలో సరికొత్త వాతావరణానికి తెర లేపింది. అనేక కొత్త గొంతుకల్ని లోకానికి పరిచయం చేసింది. డాక్టర్ నలిమెల భాస్కర్ ఇంట్లో కల్సిన అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ సాహితీ గోష్ఠి నిర్వహించాలనుకున్నారు. ప్రతీ పున్నమకు కలుసుకోవాలని భావించి ఎన్నెల కైతలు, వెన్నెల యాది, కవిత్వ కబురు, పున్నమ కవిత్వం వంటి పేర్లు సంతృప్తినివ్వక చివరికి ఎన్నీల ముచ్చట్లు అని నిర్ణయించారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి



గంభీరావుపేటలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలకు చెందిన కార్యకర్తల సమావేశానికి సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయించడం జరుగుతోందని అన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేసి ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని అన్నారు. అనంతరం రాచర్లగొల్లపల్లిలోని పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కేకే మహేందర్‌రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ సబేరాబేగం, ఏఎంసీ ఛైర్‌పర్సన్ రాములునాయక్, వైస్ ఛైర్మన్లు రాంరెడ్డి, లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సాహెబ్, హరిలాల్‌నాయక్, గౌస్, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, వెంకటేశ్, మల్లారెడ్డి, బాలయ్య, బాపిరెడ్డి, దేవానందం, దేవేందర్, బాలుయాదవ్, జనార్థన్, గణపతి, విజయ్ రెడ్డి, లక్ష్మీ, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

గంభీరావుపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు పార్టీ అధిష్టానం వద్ద ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అభ్యర్థుల ఎంపిక అందరి అభిప్రాయం మేరకు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికా ర ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమి రిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు అక్కపల్లి బాలయ్య, పిట్ల వెంకటి, కిషన్‌గౌడ్, లింగం, మల్లయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని సమావేశం అనంతరం కొందరు పార్టీ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకోవాలి

తంగళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకోవాలని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలంలో పార్టీకి పట్టు ఉందని దానిని నిలుపుకోవాలని సూచించారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నాయకులు వెద్య శివప్రసాద్, పుర్మాణి లింగారెడ్డి, నేరెల్ల నర్సింగంగౌడ్, మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి తదితరులు ఉన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే

● ఎస్పీ మహేష్ బి గీతే



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వరన్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 18 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరంత చేరువచేసి సమస్యలు పరిష్కరించేదిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు , ఫిర్యాదులు స్వీకరించి అవసరమూతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. తద్వారా ఫ్రిదుదారుడికి పోలీస్‌శాఖపై నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

రామడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గుండి సబ్‌స్టేషన్‌లో మంగళవారం గంగాధర సబ్‌డివిజనల్ పరిధిలోని గంగాధర, ఆచంపల్లి, గుండి, చొప్పదండి, ఆర్నకొండ సెక్షన్ విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం ఛైర్‌పర్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సమస్యలపై వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఛైర్మన్‌ఎన్‌వీ వేణుగోపాలచారి 8712481311, టెక్నికల్ మెంబర్ రమేష్ 8712481314 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): దళితమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను దూషించిన మంత్రి పొన్నం ప్రభాకర్ 24 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లో దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మరో మంత్రి వివేక్‌తో అహంకారంగా మాట్లాడారని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్ 24 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈ నెల 8న మంత్రి పొన్నం దిష్టిబొమ్మ దహనం చేస్తామని, 9న ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బోయిని కొమురయ్య, చెంచాల నవీన్, తడగొండ శంకర్, దండు అంజయ్య, కొత్తూరి రాజయ్య, దండు వరలక్ష్మి, రేపాక బాబు, అలువాల సంపత్, కనకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ



హుజూరాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ మాధవరావు



శంకరపట్నంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణప్రసాద్

హుజూరాబాద్/శంకరపట్నం/వీణవంక/రామడుగు/మానకొండూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం కేసీ క్యాంపులోని రైతు వేదికలో, శంకరపట్నం, వీణవంక, మానకొండూరు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్థానికసంస్థల ఎన్నికల కోసం పోలింగ్ అధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హుజూరాబాద్‌లో ట్రైనర్ మాధవరావు, శంకరపట్నం, మానకొండూర్‌లో ఎంపీడీవోలు కృష్ణ ప్రసాద్, వరలక్ష్మి ఆధ్వర్యంలో పోలింగ్ రోజు ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లను సరైన పద్ధతిలో జారీచేయడం వంటి అంశాలపై వివరించారు. ఎన్నికల సిబ్బంది ఎన్నికల ప్రక్రియపై పూర్తిఅవగాహనతో పనిచేసి, విజయవంతంగా పోలింగ్‌ను నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. రామడుగు మండల కేంద్రంలోని రైతు వేదికలో 74మంది అధికారులు పాల్గొన్నారు.